ముదిరిన ఎండలు

- 37 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- అవస్థలు పడుతున్న కూలీలు, రైతులు, కార్మికులు

మెదక్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఎండలు మండుతున్నాయి.. అప్పుడే భానుడు భగభగమంటున్నాడు. కొద్ది రోజులుగా ఎండలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల నుంచి గురువారం నాటికి 37.0 డిగ్రీలకు చేరుకుంది. పగటి వేళలో పని చేసే కూలీలు, కార్మికులు, రైతులు ఎండ తీవ్రతకు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రధాన రహదారులు బోసిపోతున్నాయి. మున్ముందు కూడా ఎండలు ఇలాగే ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని, నీటిని ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మెదక్ జిల్లాలో వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల 14 తేదీన 39.1, 15న 38.1, 16న 35.6, 17న 34.3, 18న 36.7, 19న 35.6, 20న 33.7, 21న 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు రాబోయే రోజుల్లో 40 డిగ్రీలు దాటే అవకాశాలున్నాయి.

వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి : కలెక్టర్ రాహుల్ రాజ్

నిర్మానుష్యంగా మారిన మెదక్‌లోని రహదారి

పోచారంలో గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ జిల్లా పోచారంలోని వన విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. సఫారీ వాహనంలో సుమారు 4.5 కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. జింకలు, నెమళ్లు, మనుబోతులు, పక్షులు, ఇతర అటవీ జంతువులను చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత నుంచి వన్యప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, జంతువులకు ఆహారం, తాగునీరు అందించాలని ఆదేశించారు. వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయపాలన అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మెదక్ ఆర్డీవో రమాదేవి, హవేళీ ఘనపూర్ తహసీల్దార్ నారాయణ, అటవీ అధికారి శ్రావణ్ కుమార్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ ప్రసాద్‌గౌడ్ ఉన్నారు.

ఎండ దెబ్బతో ప్రమాదం..

వడ దెబ్బతో ప్రమాదం ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఉష్ణోగ్రతలు 37 డిగ్రీలకు చేరుకోవడంతో ప్రజలు రోడ్లపైకి రావద్దు. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం శీతలపానీయాలకు బదులుగా మజ్జిగ, పండ్ల రసాలు తాగడం ఉత్తమం. – డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్

గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు

చిలిపిచెడ్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూన్న ఎంపీపీ వినోదారెడ్డి

చిలిపిచెడ్, మార్చి 22 : గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పాలనపై ప్రత్యేకాధికారులు దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి సరఫరా, స్వచ్ఛత, నర్సరీలు, హరితహారం, పారిశుధ్య పనులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆనంద్, ఎంపీటీసీలు సుభాష్‌రెడ్డి, మల్లమ్మ, సునీత, మండల కో ఆప్షన్ సభ్యుడు షఫీయొద్దీన్, తహసీల్దార్ ముసాద్దిక్, మిషన్ భగీరథ డీఈ కిషన్, అధికారులు మధుబాబు, శ్యామ్, రాంబాబు, సంతోషిమాత, ప్రేమలత పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీ కళాశాలలో వరల్డ్ వాటర్ డే

రాంచంద్రాపూర్ గ్రామంలో నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నర్సాపూర్, మార్చి 22 : పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో వరల్డ్ వాటర్ డే నిర్వహించారు. శుక్రవారం మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో చెట్ల సంరక్షణ – నీటి పొదుపుపై గ్రామస్తులకు బీవీఆర్ ఐటీకి చెందిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్‌తో పాటు సెమినార్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ కృష్ణరావు, కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

ఆకతాయిలు.. ప్రవర్తన మార్చుకోండి

ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

- అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, మార్చి 22: మహిళలు, చిన్నారులపై ఆకతాయిలు తమ ప్రవర్తన మార్చుకోవాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) మహేందర్ హెచ్చరించారు. మహిళలు, చిన్నారులను వేధించిన ఆకతాయిలకు అదనపు ఎస్పీ ఆన్‌లైన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆకతాయి పనులు చేసి బంగారు భవిష్యత్‌ను, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేసుకోవద్దన్నారు. మహిళలు, చిన్నారులను వేధిస్తే కోర్టులు విధించే శిక్షలు వివరిస్తూ ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 8712657963 నంబరుకు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్వచ్ఛందంగా రోడ్డు వేసుకున్న కేసీఆర్ కాలనీ వాసులు



రామాయంపేట, మార్చి 22: పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీవాసులు చందాలు వేసుకుని శుక్రవారం స్వచ్ఛందంగా మట్టిరోడ్డు వేసుకున్నారు. కాలనీకి వచ్చే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ట్రాక్టర్లతో మట్టి పోయించుకుని రోడ్డును బాగు చేసుకున్నారు.

వృద్ధ దంపతులకు నర్సాపూర్ కోర్టులో న్యాయం

వృద్ధ దంపతులకు ఇంటి తాళాలు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, మార్చి 22 : స్థిర, చరాస్తులను కోల్పోయి కొడుకు చేసిన మోసంతో కన్నీరు పెట్టుకున్న వృద్ధ దంపతులకు లీగల్ సర్వీస్ కోర్టు న్యాయం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన గండి లచ్చయ్య, తులసమ్మ వృద్ధ దంపతులు నర్సాపూర్ కోర్టును ఆశ్రయించి జూనియర్ సివిల్ జడ్జి అనిత ఎదుట తమ గోడు విన్నవించారు. తమ స్థిర, చరాస్తులను కుమారుడు మధుసూదన్‌గౌడ్ మోసపూరితం గా తన పేరుపై మార్చుకొని తమను రోడ్డుపాలు చేశాడని ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఉండకుండా ఇంటికి తాళం వేసి, తమను రోడ్డున పడేశాడన్నారు. వృద్ధ దంపతుల ఫిర్యాదును జడ్జి అనిత విచారించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ నమోదు చేసిన పీఎల్‌సీ కేసును పరిశీలించారు. కొడుకు అక్రమంగా స్వాధీనం చేసుకున్న ఇంటిని వృద్ధ దంపతులకు కేటాయిస్తూ ఇంటి తాళాలను అప్పగించారు. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం వారసులను కఠినంగా శిక్షించబడతారని జడ్జి అనిత హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపరాణి, కోర్టు సూపరింటెండెంట్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు

చిలిపిచెడ్, మార్చి 22: చిలిపిచెడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఏపీఎం ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీసీ సూపార్ వైజర్ సంతోషిమాత మాట్లాడారు. చిన్నారులకు పోషణ లోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మహిళలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళాలు బాగుంటేనే.. సమాజం బాగుంటుంది

మెదక్ రూరల్, మార్చి 22 : సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చదిద్దేందుకు ప్రభుత్వం పోషణ్ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నదని అదనపుకలెక్టర్ రమేశ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పోషణ్ పక్వాడ్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాక్ పోలింగ్ స్టేషన్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. మహిళాలు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. జిల్లాలో 100 శాతం పోలింగ్ జరిగేలా కృషి చేయాలని కోరారు. జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మజీ మాట్లాడుతూ.. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పిస్టల్‌తో బెదిరించి మేక చోరీ

నర్సాపూర్,మార్చి 22: మేకను చోరీచేసి పారిపోతుండగా పట్టుకోడానికి వెళ్లిన వ్యక్తిపై గన్ చూపించి భయభ్రాంతులకు గురిచేసిన ఘటన మండలంలోని రెడ్డిపల్లిలో సంచలనం రే పింది. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లికి చెంది న పోచమ్మ శుక్రవారం తన మేకలు మేపి ఇం టికి తోలుకొస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమెను బెదిరించి మేకను బైక్‌పై పెట్టుకుని నర్సాపూర్ వైపు పరారయ్యారు. ఇది గమనించిన గ్రామస్తుడు ఊరిలోకి వెళ్లి అందరికీ విషయం చెప్పాడు. తక్షణమే గ్రామస్తులు స్పందించి దుండగులను వెంబడించగా నర్సాపూర్ శివారులో పట్టుబడ్డారు. వారిని బైక్‌పై ఎక్కించుకుని రెడ్డిపల్లికి తీసుకొస్తుండగా వెనకాల కూర్చున్న ఒకరు గన్‌తీసి బైక్ నడిపిస్తున్న వ్యక్తి తలపై పెట్టాడు. ఇది గమనించిన ఆ వ్యక్తి చేతితో గన్‌ను ఒక్కసారిగా కొట్టడంతో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో గన్ ఎగిరి కొద్దిదూరంలో పడింది. దుండగులను పోలీసులకు అప్పగించారు. దుండగులు హైదరాబాద్‌లోని షాపూర్‌కు చెందిన మధు, భీమ్‌రావుగా గుర్తించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మల్టీజోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికలపై జిల్లా ఎలక్షన్ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఆయనకు జిల్లా పోలీస్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఎస్పీ బాలస్వామి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్ డీఎస్పీ రాజేశ్వర్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

చిలిపిచెడ్‌లో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం మండల సభ్యులు

నర్సాపూర్‌లో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దశంకరంపేట, మార్చి22: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శంకర్ సూచించారు. మండలం ఉత్తులూర్ గ్రామంలో మెదక్ పోలీస్ బృందం శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించింది. సదస్సులో ఎస్సై శంకర్ మాట్లాడారు. రోడ్డు భద్రతా నిబంధనలు, బాల్య వివాహాలు– నష్టాలు, మూఢ నమ్మకాలు, మద్యపానం, ఇతర సామాజిక రుగ్మతలతో పాటు షీటీమ్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ముగిసిన తైబజార్ వేలం

పెద్దశంకరంపేట, మార్చి 22: పెద్దశంకరంపేట తైబజార్ వేలం ముగిసినట్లు తహసీల్దార్ గ్రేసిబాయి తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. పట్టణానికి చెందిన ఎం.కిష్ట య్య రూ.8.01 లక్షలకు వేలం పాడి తైబజార్‌ను దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పశువుల సంత, కాంటా పాటకు సరైన ధర రాకపోవడంతో వేలం పాట నిలిపివేసినట్లు వివరించారు. వేలం పాటలో ఈవో వెంకట్‌రాములు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం(డీ)లో ఆరోగ్య సర్వే

రామాయంపేట, మార్చి 22: రామాయంపేట మండలం ధర్మారం(డీ) గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హరిప్రియ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్నారు. శరీరంపై దద్దర్లును పరిశీలించి, మందులు అందజేస్తున్నారు. క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి ఇంటిలో ఆరోగ్య సర్వే నిర్వహిస్తున్న వైద్యురాలు హరిప్రియ తెలిపారు.

బీజేవైఎం మెదక్ పట్టణాధ్యక్షుడిగా రాకేశ్

నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 22 : బీజేవైఎం మెదక్ పట్టణాధ్యక్షుడిగా నిమ్మల రాకేశ్‌ను నియమిస్తూ శుక్రవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని ప్రసాద్ నియామక పత్రం అందజేశారు. త్వరలోనే పూర్తి స్థాయి పట్టణ కమిటీని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌పటేల్, నాయకులు ఎమ్ ఎల్ఎన్ రెడ్డి, నాగరాజు, రాహుల్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర గ్రామ కమిటీ ఎన్నిక

నియామక పత్రాన్ని అందుకుంటున్న కుంట లక్ష్మణ్

శివ్వంపేట, మార్చి 22: మండలంలోని గోమారం గ్రామంలో గంగపుత్ర సంఘం గ్రామ కమిటీ ఎన్నికను జిల్లా కోపరేటివ్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గంగపుత్ర సంఘం గ్రామాధ్యక్షుడిగా కుంట లక్ష్మణ్, కార్యదర్శిగా కాముని గణేశ్, ఉపాధ్యక్షుడిగా పూస శంకర్, డైరెక్టర్లుగా కాముని బాలకృష్ణ, కాముని రాములు, పూస ఆంజనేయులు, పూస భిక్షపతి, కుంట నర్సింగ్, కుంట ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కాముని శ్రీనివాస్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో 'ఎస్ఎస్‌టీ' తనిఖీ

రామాయంపేట, మార్చి 22 : రామాయంపేట మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిపై ఎన్నికల బృందాలు వాహనాల తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం దామరచెర్వు బైపాస్ రోడ్డుపై తనిఖీ బృందం సభ్యులు ఆర్‌డబ్ల్యూ ఏఈ నక్క భిక్షపతి ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల మీదుగా వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ బృందం సభ్యులు, వీడియోగ్రాఫర్ బాలరాజు, కానిస్టేబుళ్లు రవీందర్, కృష్ణ ఉన్నారు.

మాలమహానాడు అడ్‌హక్ కన్వీనర్ ఎన్నిక

శివ్వంపేట, మార్చి 22 : మాల మహానాడు జాతీయ అడ్‌హక్ కమిటీ మండల కన్వీనర్‌గా లింగోజిగూడ గ్రామానికి చెందిన చింతల రాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు రాజుకు శుక్రవారం జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరు సంజీవ, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దాడిగ నరేశ్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తలారి శ్రీకాంత్, నాయకులు ఊరట్ల శివ, నీరుడు కుమార్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు మడలేశ్వర ఉత్సవాల ఆహ్వానం


పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చల్మెడ గ్రామ రజకులు

నిజాంపేట, మార్చి 22: మండలంలోని చల్మెడలో మడలేశ్వరాశీతలాదేవీ ఆలయంలో ఏప్రిల్ 22న విగ్రహ ప్రతిష్ఠాపన, స్వామి వారి కల్యాణం ఇతర పూజా కార్యక్రమాలను రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మడలేశ్వర ఉత్సవాలకు హాజరుకావాలని శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులను హైదరాబాద్‌లో రజక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌రావు, మహేశ్, రజక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ముగిసిన రేణుకాఎల్లమ్మ ఉత్సవాలు

ఎల్లమ్మ అమ్మవారికి బోనాలను తీసుకెళ్తున్న ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌గౌడ్

చేగుంట, మార్చి 22: మక్కరాజిపేటలోని ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ముగిసింది. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఐదు రోజులు కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి నాగవెళ్లి నిర్వహించి, బోనాలు సమర్పించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, సభ్యులు రామచంద్రంగౌడ్, శంకర్‌గౌడ్, నర్సింహులుగౌడ్, ప్రభాకర్‌గౌడ్, నాగరాజుగౌడ్, నరేశ్‌గౌడ్, వెంకటిగౌడ్ పాల్గొన్నారు.

నీటిని వృథా చేయవద్దు

మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సింహరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 22 : నీటిని సరైన పద్ధతిలో వాడకమే నీటి సంరక్షణ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సింహరెడ్డి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో వృక్ష శాస్త్రం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సింహరెడ్డి మాట్లాడుతూ.. నీటిపైనే ప్రాణులన్నీ ఆధారపడి జీవిస్తున్నాయని, భూమిపై పడిన ప్రతి నీటి చుక్కను సంరక్షించి, వినియోగించుకోవాలన్నారు. నీటి కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలుషితమైన నీరు తాగితే జన్యుపరమైన మార్పులు వస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుమల్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, మురళి, రాజు, సుధారాణి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు అవగాహన ర్యాలీలో ఆదనపు కలెక్టర్ రమేశ్

- జిల్లా ఆదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 22 : ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమని.. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఓటు వేయాలని ఆదనపు కలెక్టర్ రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రమేశ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని జిల్లావ్యాప్తంగా పెంచాలనే ఉద్దేశంతో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో వంద శాతం పోలింగ్ సాధించాలన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం–6 ద్వారా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి బ్రహ్మజీ, స్వీప్ అధికారి రాజిరెడ్డి, మెప్మా పీడీ ఇందిర, బీఎల్వోలు, ఆర్పీలు, మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఉత్సవాల్లో పాల్గొన్న మఠం భిక్షపతిని సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

అల్లాదుర్గం, మార్చి 22 : మండల కేంద్రంలో వేంకటేశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం గురుమదానంద పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాపనోత్సవాల్లో పురోహితులు శిలాంకోట ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం అవాహిత దేవతాపూజ, మూల మంత్రహవనం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామికి ఆభరణాలు సమర్పించారు. వేడుకలకు హాజరైన భక్తులకు మూడు రోజులపాటు మహా అన్నదానం నిర్వహించారు. కాగా, ఆలయంలో గరుడ పల్లకీ తయారీకి రూ.3 లక్షల ఆర్థికసాయాన్ని జాగృతి రాష్ట్ర నాయకుడు మఠం భిక్షపతి అందజేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలకు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జాగృతి రాష్ట్ర నాయకుడు మఠం భిక్షపతి, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్, ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డితోపాటు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

పోలీసుల కవాతు

అల్లాదుర్గం, మార్చి 22: మండలంలోని రెడ్డిపల్లిలో శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రజలందరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ రేణుకా రెడ్డి హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.